క్లుప్తంగా

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న మాజీ ఎంపీ పోచా

నంద్యాల(అర్బన్): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని శ్రీశైల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఇందులో తేజశ్రీ 589 మార్కులతో ప్రతిభ చాటింది. అలాగే మనీషా 561, అనూష 553, కావ్యాభాయి 541, చందన 515, సమీర్ 506, అనీల్‌కుమార్ 500 మార్కులు సాధించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అభినందించారు.

ఉపాధ్యాయుడికి పదవీ విరమణ సన్మానం


సన్మాన సభలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక నేషనల్ పీజీ కళాశాల సమావేశ మందిరంలో ఉపాధ్యాయుడు గాజుల వీరప్ప పదవీ విరమణ సభను గురువారం నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మౌలాలి, అజాంబేగ్ మాట్లాడుతూ.. వీరప్ప గడివేముల మండలం కరిమద్దెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు బంధువులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి పి.శివశంకర్, రాష్ట్ర కార్యదర్శి గోపాలకృష్ణ, రాష్ట్ర బైలా కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, కన్వీనర్ నాగేంద్రకుమార్, వెంకట్రామిరెడ్డి, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

గురురాజ విద్యార్థుల ప్రభంజనం

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి ఫలితాల్లో గురురాజ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు అత్యధికంగా 597 మార్కులు సాధించి చాటారన్నారు. తిరుమల్లేశ్వరరెడ్డికి 591, అబ్దుల్ 590, పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆరుగురు 590, 33 మంది 550, 109 మంది 500 మార్కులకు పైగా ఫలితాలు సాధించినట్లు తెలిపారు.

పదిలో గుడ్‌డే స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుడ్‌డే స్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రసూల్ ఆజాద్ పేర్కొన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. చాంద్‌బాషా 581, వర్ష 537 మార్కుల సాధించారన్నారు.

దుర్గాప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి


విద్యుత్ ఎస్‌ఈకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నంద్యాల(అర్బన్): విద్యుత్ సంస్థలో ఆపరేటర్, అటెండర్, క్లర్క్ పోస్టులు ఉన్నాయంటూ నిరుద్యోగులను నమ్మించి సొమ్ము చేసుకుంటున్న లోకేష్ కన్‌స్ట్రక్షన్ యజమాని దుర్గాప్రసాద్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులికొండన్న కోరారు. అతని మాటలను నమ్మి నిరుద్యోగులెందరో డబ్బులు చెల్లించి బాధితులుగా మారారని, కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల్లో వేలాది మంది నిరుద్యోగులు బాధితులుగా ఉన్నారని తెలిపారు. ఈ మేరకు గురువారం మహిళా నాయకురాలు బోయ భారతితో కలిసి విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఎస్ఈ స్పందిస్తూ విద్యుత్ సంస్థలో ఉద్యోగాలు ఏమైనా ఉంటే ప్రకటన ఇస్తామని, డబ్బులు ఇచ్చి నిరుద్యోగులు మోసపోవద్దని సూచించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి


గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

ఉయ్యాలవాడ: ఉద్యోగులు, ప్రజల భాగస్వామ్యంతో కలిసి పని చేస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, అందుకు ఉద్యోగులు కూడా తమ వంతు సహకారం అందించాలని మండల అధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అన్నారు. గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దివస్ పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధికారులతో కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ హరికృష్ణ, హౌసింగ్ ఏఈ నరసింహారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫలితాలపై పరేషాన్ వద్దు

- క్షణికావేశంతో అనర్థమే
- ప్రతిభకు మార్కులు కొలమానం కాదు
- పరీక్షలే సర్వస్వం అనుకోవద్దు
- విడుదలైన పది పరీక్షల ఫలితాలు
- తల్లిదండ్రులు పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని నింపాలి


పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

గోస్పాడు: విద్యార్థులకు చదువు ఒక్కటే కాదు ఆటపాటలు కూడా అవసరమే. అయితే చదువులో ర్యాంకులు, మార్కులంటూ ఒత్తిడికి లోనైతే వారి జీవితంపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. కారణం ఏదైనా కావచ్చు నిండు నూరేళ్ల జీవితాన్ని అర్ధంతరంగా ముగించేస్తున్నారు. పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ఒత్తిడితో ప్రాణాలను బలి తీసుకోవద్దని, ఒత్తిడిని చంపేసి ఉజ్వల భవితకు బాటలు వేసుకోండని, ఆత్మ స్థైర్యాన్ని పెంచుకోవాలని మానసిక నిపుణులు, విద్యావేత్తలు సూచిస్తున్నారు. కష్టం వచ్చిందని కుంగిపోతే రేపటి పనిని పూర్తి చేయలేం అనే విషయాన్ని పిల్లలు గుర్తించాలి.

ప్రశాంతంగా ఆలోచించాలి..

ఫలితాలు ఎలా ఉన్నా కాసేపు ప్రశాంతంగా ఆలోచించుకుని ఆత్మ విమర్శ చేసుకుంటే చాలని, అనవసర ఆందోళనలకు ఒత్తిడికి గురై తప్పుడు నిర్ణయాలకు పాల్పడరాదని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఓటమి విజయానికి తొలి మెట్టని, నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నది వీరి సూచన. ఎందుకు ఓడిపోయాం, కారణమేమై ఉంటుంది, మరోసారి అలాంటి తప్పు జరగకుండా సరిదిద్దుకుని మళ్లీ ప్రయత్నిస్తే విజయం తప్పక వరిస్తుందని పేర్కొంటున్నారు.

విద్యార్థులకు సూచనలు..

- పాస్, ఫెయిల్ అన్నవి సాధారణ విషయాలు.
- జీవితం ఎంతో విలువైనది. భవిష్యత్లో ఎన్నో విజయాలు సాధిస్తామన్న సానుకూల దక్పథంతో ముందుకు సాగాలి.
- ఏ ఫలితమూ జీవితాన్ని నిర్దేశించదు.
- వ్యతిరేక ఫలితం ఎదురైతే కాసేపు ప్రశాంతంగా ఆలోచించి జరిగిన పొరపాటును గుర్తించాలి.
- ఒత్తిడి నుంచి వేగంగా బయటపడే ప్రయత్నం చేయాలి.
- జరిగిన తప్పును వీలైనంత వరకు తల్లిదండ్రులకు చెబితే భారం దిగిపోయి నట్లేనని గ్రహించాలి.
- వెనుకబడిన సబ్జెక్టులు లేదా పాఠ్యాంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి అవసరమైతే ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు తీసుకోవాలి.
- తొందరపాటు నిర్ణయాల వల్ల తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఎంత క్షోభకు గురవుతారోనని ఒక్క క్షణం ఆలోచించాలి.

తల్లిదండ్రులు గుర్తుంచుకోవాల్సినవి..

- తమ పిల్లలు అనుకున్న మార్కులు సాధించలేదనో, పరీక్ష తప్పారనో వారిని మందలించొద్దు.
- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పోల్చి అవహేళన చేయొద్దు.
- ఫలితాల సమయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.
- ఫలితాలు ప్రతికూలంగా వస్తే వారు తీవ్ర నిరాశకు గురవుతారు. ఆ సమయంలో వారిని అక్కున చేర్చుకోవాలి. జరిగిన పొరపాటు గురించి పిల్లలతో సున్నితంగా చర్చించి, మీకు మేమున్నామన్న భరోసాను ఇవ్వగలిగితే ఉన్నతంగా ఎదిగే అవకాశముంటుంది.

మార్కులు కొలమానం కాదు



పది పరీక్షల ఫలితాలు విడుదల అయ్యాయి. ఈ సమయంలో విద్యార్థులు క్షణికావేశానికి లోనయ్యే అవకాశం ఉంటుంది. అధ్యాపకులు, తల్లిదండ్రులు మార్కులు తక్కువ వచ్చినా, ఫెయిల్ అయిన విద్యార్థులను చిన్నచూపు చూడకూడదు. విద్యార్థి ప్రతిభకు మార్కులు కొలమానం కాదు. మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి తీసుకురాకూడదు. జీవితంలో ఏదైనా సాధించాలనే కసి, పట్టుదల, ఆత్మవిశ్వాసం కలిగిన వారే ఏదైనా సాధిస్తారు.

– అబ్దుల్‌కరీం, ఎంఈఓ, గోస్పాడు.

ఒత్తిడిలో ఉన్న పిల్లలను గుర్తించాలి



పరీక్షల్లో తప్పినంత మాత్రాన జీవితం ముగిసినట్లు కాదు. పరీక్ష తప్పిన విద్యార్థులు ఆత్మ న్యూనతను వీడాలి. జరిగిన తప్పు పునరావృతం కాకుండా చూసుకోవాలి. తల్లితండ్రులు పిల్లల ప్రవర్తనను గ మనిస్తూ ఉండాలి. డిప్రెషన్లో ఉన్న పిల్లలు నిద్రాహారాలకు దూరంగా ఉంటారు. ఒంటరితనాన్ని కోరుకుంటారు. అటువంటి వారి పట్ల స్నేహపూర్వకంగా మెలగుతూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి.

– నాగేంద్రుడు, ప్రధానోపాధ్యాయుడు, యాళ్లూరు

జీవితం నష్టపోదనే భరోసా ఇవ్వాలి



ఒకసారి పరీక్షలో తప్పితే జీవితం నష్టపోదనే భరోసా నివ్వాలి. మళ్లీ చదివి పాస్ కావచ్చనే ధైర్యం నింపాలి. పాస్ కాలేదని తిట్టకుండా, వేధించకుండా సముదాయించాలి. తిరిగి మంచిగా చదివి పాసయ్యేలా ప్రోత్సహించాలి. విద్యార్థులు కూడా క్షణికావేశానికి లోనుకాకుండా సమస్యను స్నేహితులు, తల్లిదండ్రులు, సన్నిహితంగా ఉండే టీచర్లతో చర్చించాలి. మార్కులు కాదు విజ్ఞానమే ముఖ్య మనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి.

– వెంకటరమణ, డీఎంహెచ్ఓ, నంద్యాల

శ్రీనిధి ద్వారా రూ.149 కోట్ల రుణాలు

నంద్యాల(న్యూటౌన్): 2025–26 ఏడాదికి శ్రీనిధి ద్వారా పొదుపు మహిళలకు రూ.149 కోట్లు ఇప్పించాలన్నదే లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో పొదుపు ఐక్యసంఘాల సభ్యులతో గ్రామ స్థాయిలో ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు అన్యువల్ క్రెడిట్ అండ్ లైవ్లీవుడ్ ప్లాన్‌పై సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 96శాతం సర్వే పూర్తయిందన్నారు. నంద్యాల జిల్లాకు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.1400 కోట్లు అవసరమవుతందని సర్వేలో తెలిసిందన్నారు. ఇంకా 4శాతం పూర్తయితే ఈ ఆర్థిక సంవత్సరానికి బ్యాంకుల ద్వారా ఎంత మొత్తం సభ్యులకు రుణాలు ఇప్పించాలో తెలుస్తుందని తెలిపారు. ఖరీఫ్ పంటల ప్రణాళిక, నవధాన్యాల సాగు, మహిళా సంఘాల పాత్ర గురించి తెలియజేశారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రతి సభ్యులకు పెరటి తోటల పెంపకం గురించి వివరించారు. బ్యాంకు లింకేజీ, ఉన్నతి, శ్రీనిధి, కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాల గురించి స్వయం సహాయక సంఘాల సభ్యులకు వివరించారు. సమావేశంలో ఎల్‌డీఎం రవీంద్రకుమార్, డీపీఎం కృష్ణమూర్తి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి డీఈఓ అభినందన

ఆళ్లగడ్డ: పట్టానికి చెందిన విద్యార్థి అచ్చుకట్ల మహమ్మద్ ఆదిల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి గురువారం అభినందించారు. పదో తరగతి ఫలితాల్లో 596 మార్కులు సాధించడంతో మహమ్మద్ ఆదిల్‌ను అభినందించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా ఉన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ

పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందిస్తాం

- జేసీ విష్ణుచరణ్

నంద్యాల: ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు నిర్వహణను మరింత పటిష్టం చేస్తామని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పారదర్శక ఎన్నికల జాబితా, నిర్వహణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం సూచించిన ఆదేశాల మేరకు పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించి ఎన్నికల నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకుని నిబంధనల మేరకు ఎన్నికల సంఘానికి నివేదించామన్నారు. రాజకీయ పార్టీలు బూత్ ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలని సూచించారు. సీపీఎం తరఫున నర్సింహులు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులతో పాటు డెత్ ఓటర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఓటర్ల స్లిప్పుల్లో పేర్లతో పాటు ఫొటో కూడా ఉంటే సులువుగా ఓటర్లు గుర్తించవచ్చని.. చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్, వైఎస్సార్‌సీపీ నుంచి సాయిరాంరెడ్డి, బీఎస్పీ తరఫున కొట్టం శ్రీనివాసులు, సీపీఎం నుంచి శ్రీనివాసులు, కాంగ్రెస్ నుంచి రియాజ్ బాషా, ఎలక్షన్ సూపరింటెండెంట్ జయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

కాల్షియం కార్బైడ్ పండ్ల విక్రయాన్ని నిరోధించండి

సీజనల్ పండ్లు పక్వానికి వచ్చేందుకు కాల్షియం కార్బైడ్ వాడకాన్ని నిరోధించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. గురువారం పండ్ల దుకాణాల వ్యాపారులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సీజనల్ పండ్లు పక్వానికి వచ్చేందుకు కాల్షియం కార్బైడ్ వాడకాన్ని నిరోధించి వినియోగదారుల ఆరోగ్య రక్షణకు తోడ్పాటు అందించాలన్నారు. పండ్ల దుకాణదారులు సహకరించాలని కోరారు. పురపాలక, గ్రామ పంచాయతీల్లో ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు ఈ విధానాన్ని నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సహజ హార్మోన్ ఎథిలిన్ గ్యాస్ చేయడం ద్వారా మామిడి పండ్లను మాగబెట్టవచ్చన్నారు. ప్రజలకు హాని కలిగించే కాల్షియం కార్బైడ్ ఉపయోగించి పండ్లు మగ్గబెట్టే విధానాన్ని పూర్తిగా అరికట్టాలని సూచించారు. ఇలా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉద్యానశాఖ అధికారులు పండ్లను మగ్గబెట్టే సురక్షిత విధానాలపై రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకట రాముడు, షాషావలి, ఉద్యానశాఖ అధికారి నాగరాజు, డీపీఓ జమివుల్లా, మార్కెటింగ్ ఏడీ రెహమాన్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఎస్‌పీజీ చర్చి మహోత్సవాలు ప్రారంభం

- మొదటి రోజు బైబిల్‌పై వ్యాసరచన పోటీలు పూర్తి
- నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో 141 ఏళ్ల చరిత్ర కలిగిన నంద్యాల అధ్యక్ష మండలానికి జన్మస్థానంగా గుర్తింపు పొందిన ఎస్‌పీజీ చర్చి 2వ పునర్నిర్మాణ ప్రతిష్ఠ (దోరల తిరునాల) ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మరో రెండు రోజుల(25, 26 తేదీలు) పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రొస్టేట్ చైర్మన్ రెవ.ఆర్.ఏ.ఈ.సంజీవరాజ్ తెలిపారు. మొదటి రోజు గురువారం చర్చి గురువులమ్మ ఆర్.అరుణకుమారి ఆధ్వర్యంలో బైబిల్‌పై వ్యాస రచన పోటీలు నిర్వహించామన్నారు. చాగలమర్రి, రుద్రవరం మండలాల్లోని పలు గ్రామాల నుంచి 20 మంది హాజరయ్యారన్నారు. శుక్రవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలను నిర్వహిస్తామన్నారు. చివరి రోజు విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే శుక్రవారం రాత్రి 2వ పునర్నిర్మాణ సిద్ధ పాటు ఆరాధనలు నిర్వహిస్తామన్నారు. 26న ముత్యాలపాడు భజన బృందం చేత భజన కార్యక్రమం ఉంటుందన్నారు.


ముత్యాలపాడు గ్రామంలోని అతిపురాతనమైన ఎస్‌పీజీ చర్చి


వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

చర్చి ప్రాముఖ్యత..

మొట్టమొదటి మిషనరీ సెంటర్‌ను ముత్యాలపాడు గ్రామంలో 1852 ప్రారంభించారు. 1877లో ఇంగ్లాండ్ దేశానికి చెందిన దైవసేవకుడు రెవ.డెండి షెప్పర్డ్ దొర క్రైస్తవమత బోధన చేపట్టారు. అందులో భాగంగా అప్పటి మద్రాసు అధ్యక్ష ఖండపు బిషప్ ది రైట్ రెవ ఫెడ్రిక్ జెల్ సహకారంతో ముత్యాలపాడులో 1884 డిసెంబర్ 27న పరిశుద్ధ జన్మోత్సవాలయం పేరుతో ఎస్‌పీజీ చర్చికి శంఖుస్థాపన చేయగా 1893 డిసెంబర్ 9 నాటికి రెవ డెండి షెప్పర్డ్ దొర పర్యవేక్షణలో పూర్తి కాగా బిషప్ ది రైట్ రెవ ఫెడ్రిక్ జెల్ చేతుల మీదుగా ఆలయ ప్రతిష్ఠ జరిగింది. రెవ డెండి షెప్పర్డ్ దొర తాను నివాసం ఉండటానికి ఒక పెద్ద బంగ్లాను నిర్మించుకుని కాలక్రమేణా ఆయన ముత్యాలపాడు గ్రామాభివృద్ధికి తోడ్పడ్డారు. మొట్టమొదటి మిషనరీ పాఠశాలను సైతం ఆయన నివాసానికి ఏర్పాటు చేసుకున్న బంగ్లాలోనే 1852లో ఎస్‌పీజీ ఉన్నత పాఠశాలను, వసతి గృహాన్ని ఏర్పాటు చేయించారు.

ఉగ్రవాదాన్ని అంతం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి 28 మందిని చంపిన తీవ్రవాదులను శిక్షించాలని సిఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ.. కాశ్మీర్ అంటేనే టూరిస్ట్ కేంద్రమని..టూరిజం, భారత దేశ సమగ్రతను దెబ్బతీయడానికి ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఇంతటి దారుణానికి పాల్పడిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని కోరారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో భద్రత కల్పించాలన్నారు.

నంది సంస్థ ఉద్యోగుల ర్యాలీ

కాశ్మీర్ ఉగ్రవాద ఘటనను నిరసిస్తూ నంది సంస్థల ఉద్యోగులు, కార్మికులు గురువారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నంది పైప్స్ సంస్థ ఎండీ సుజల మాట్లాడుతూ.. కాశ్మీర్ ఉగ్రవాద ఘటనకు పాల్పడిన వారిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి పద్మావతినగర్, కల్పనా సెంటర్, గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి నివాళులు అర్పించారు.

నిరసన ప్రదర్శన

నంద్యాల (వ్యవసాయం): ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్‌లో పర్యాటకులపై తీవ్రవాదులు దాడి చేసి మతం ఆధారంగా హతమార్చడం దారుణమని బీజేపీ, విశ్వహిందూ పరిషత్, హిందూ ధర్మ పరిరక్షణ సమితి, హిందూ ఐక్యవేదిక సంఘాల నాయకులు అన్నారు. గురువారం మృతులకు నివాళులర్పిస్తూ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. భరతమాత దేవాలయం నుంచి నాగులకుంట రోడ్డు, గాంధీ చౌక్ వరకు ర్యాలీ సాగింది. నాయకులు బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి, రామకృష్ణారెడి, మురళీధర్, విష్ణువర్ధన్, బసవరాజు మాట్లాడుతూ.. భారతదేశ సార్వభౌమతాన్ని దెబ్బతీసే అమాయక ప్రజలను చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, ఉగ్రవాద కేంద్రాలను నాశనం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మహేశ్వరరెడ్డి, ఉదయశంకర్, శేషసాయి, నంద్యాల కిషోర్, నాగరాజు, చిలుకూరి శ్రీనివాస్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో ర్యాలీ చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

సిబ్బందిపై అడ్మిషన్ల కత్తి..!

- అడ్మిషన్లు చేయకుంటే జీతాలు కట్
- టార్గెట్ పూర్తయితేనే ఉద్యోగం పదిలం
- మండుటెండల్లో ఇంటింటికీ క్యాంపెయిన్
- ప్రైవేటు విద్యాసంస్థల సిబ్బందికి తప్పని తిప్పలు

నంద్యాల(న్యూటౌన్): ప్రస్తుతం విద్య వ్యాపారంగా మారింది. విద్యాసంస్థలు వాణిజ్య సంస్థలుగా మారాయి. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. వీధికొకటి కార్పొరేట్ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టుకొచ్చాయి. కార్పొరేట్ హంగులతో తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్లు పెంచుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులకే కాకుండా చిన్నాచితక బోధనేతర సిబ్బందికి టార్గెట్లు విధిస్తున్నాయి. అడ్మిషన్లు చేస్తే జీతాలు ఇస్తామని, ఉద్యోగం సైతం పదిలంగా ఉంటుందని తెగేసి చెబుతున్నాయి. ఈ క్రమంలో అందులో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది. టార్గెట్ పూర్తిచేసే పనిలో పడ్డారు. మండుటెండల్లో ఇంటింటికీ క్యాంపెయిన్ నిర్వహిస్తూ ×మీ పిల్లలను మా విద్యాసంస్థలో చేర్పించండి× అంటూ ప్రాధేయ పడుతున్నారు.

అడ్మిషన్ల వేట...

ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల సిబ్బంది అడ్మిషన్ల వేట మొదలు పెడుతున్నారు. పీఆర్వోల పేరుతో సిబ్బందిని నియమించుకుని 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల అడ్రెస్‌లను సేకరిస్తున్నారు. ఆ తర్వాత వాళ్ల ఇళ్లకు వెళ్లి తమ కళాశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులను బతిమాలుకుంటున్నారు. ఇప్పుడే అడ్మిషన్ చేయించుకుంటే ఫీజులో రాయితీ ఇస్తామని చెప్పి నమ్మబలుకుతున్నారు.



మోసపోతున్న తల్లిదండ్రులు

ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రత్యేకతలను గ్రాఫిక్స్‌లో చూపించడంతో తల్లిదండ్రులు ఆకర్షణలో పడి మోసపోతున్నారు. ప్రభుత్వ, స్థానిక ప్రైవేటు పాఠశాలలు మించి తమ విద్యాసంస్థలో ఉన్న సౌకర్యాలను వివరిస్తున్నారు. రోజువారీ టెస్టులు, ప్రతి రోజూ స్టడీ అవర్స్, కంప్యూటర్, లైబ్రరీ, ల్యాబ్, ప్రతి పండుగ సెలబ్రేషన్, ఆటపాటలతో పాటు కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉద్యోగులు బదిలీ అయితే అదేచోట బ్రాంచ్‌కు విద్యార్థుల బదిలీ సౌకర్యం కల్పిస్తామని కార్పొరేట్ స్కూల్ సిబ్బంది వివరిస్తున్నారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకుని అడ్మిషన్ ఫీజు కట్టించుకునే వరకూ పాఠశాల ఫీజు మాత్రమే చెబుతారు. ఫీజు చెల్లించిన తరువాత బస్సు ఫీజు, యూనిఫామ్, బుక్స్ ఫీజు అంటూ ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలు ఆన్‌లైన్‌లో ఫిక్స్ చేసిన ఫీజులని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు నిలువునా మోసపోతున్నారు.

వేధిస్తూ.. టార్గెట్లు విధిస్తూ..

జిల్లాలో దాదాపు 700లకుపైగా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లున్నాయి. ఈ పాఠశాలల్లో దాదాపుగా 20 వేల మంది వరకూ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి ఆయా పాఠశాలల నిర్వాహకులు ప్రస్తుత విద్యాసంవత్సరానికి గత సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే అడ్మిషన్ల టార్గెట్ విధిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో పరీక్షలవ్వగానే పూర్తి స్థాయిలో టార్గెట్‌ను రీచ్ అవ్వాలంటూ ఆదేశిస్తున్నారు. టార్గెట్ చేస్తేనే జీతం, ఉద్యోగం రెండూ పదిలమంటూ హుకుం జారీచేస్తున్నారు. ఈ నిబంధనలకు పనిచేయాలో.. లేక బయటకు రావాలో.. తెలియక అయోమయ పరిస్థితుల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు.

నానా తంటాలు

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు గత నెల నుంచే ఆయా పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇంటింటికీ పంపిస్తున్నారు. ఓట్ల ప్రచారం, ఇంటింటి సర్వేలు చేసే వాళ్లలా ఉపాధ్యాయులు ప్రతి ఇంటికీ వెళ్లి మీ ఇంట్లో పిల్లలు ఉన్నారా.. ఏం చదువుతున్నారని ఆరా తీస్తున్నారు. వారిని తమ పాఠశాల, కళాశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను బతిమాలుకుంటున్నారు. ఒక్కొక్కరు 10–15 మంది పిల్లలను కచ్చితంగా పాఠశాలలో చేర్పించాల్సి రావడంతో ఎండలు సైతం లెక్కచేయక నానా తంటాలు పడుతున్నారు.

శోచనీయం

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విధులు నిర్వహించే బోధన, బోధనేతర సిబ్బందికి అడ్మిషన్ల టార్గెట్ ఇవ్వడం శోచనీయం. చాలీచాలని జీతం, వెట్టి చాకిరీతో సతమత మవుతున్న వారిపై టార్గెట్ అదనపు భారమవుతోంది. దీనిపై విద్యా శాఖ, కూటమి ప్రభుత్వం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి. –సూర్యప్రతాప్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, నంద్యాల

టార్గెట్ వేదన

ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో పనిచేసే సిబ్బందిపై టార్గెట్ వేదన అధికమవుతోంది. ఇదివరకు పీఆర్వో విభాగాన్ని ఏర్పాటు చేసుకుని అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టేవారు. అయితే కొంత కాలంగా అక్కడ పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందితో అడ్మిషన్లు చేయిస్తున్నారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం స్పందించాలి.
–ఎంఆర్‌నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నంద్యాల

వీధికుక్క దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని వీవర్స్ కాలనీలో గురువారం వీధికుక్క దాడిచేసిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరేళ్ల చిన్నారి భార్గవి ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధికుక్క దాడిచేసి చెట్లల్లోకి లాక్కెళ్తుండటంతో గట్టిగా కేకలు వేసింది. అరుపులు విని ఇంట్లో ఉన్న బాలిక పెద్దమ్మ అరుణ కుక్కను తరిమేందుకు యత్నించగా ఆమెపైనా దాడిచేసింది. సమీపంలో ఉన్న కుమారుడు ఇమ్మానియెల్ వచ్చి విడిపించేందుకు యత్నించగా అతనిపైనా దాడిచేసింది. ఇరుగుపొరుగు వారు కర్రలు, రాళ్లు తీసుకుని కుక్కను తరిమేశారు. గాయపడిన ముగ్గురి స్థానిక వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా కుక్కల బెడద ఎక్కువగా ఉందని అనేకసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గాయపడిన భార్గవి


అరుణ

రుణాలకు దరఖాస్తులు

బండిఆత్మకూరు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు మే 10 లోపు ఓబీఎంఎంఎస్ వెబ్ సైట్‌లో గానీ, సచివాలయాల్లో గానీ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.దస్తగిరి గురువారం ప్రకటనలో తెలిపారు.